చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం, పాల్తేరు గ్రామాలలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివాజీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దేశం కోసం అహర్నిశలూ శ్రమించి, స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని, వారిలాగే భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. ఈ నెల 2 నుంచి జరుగుతున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి నెహ్రూ చౌక్ మీదుగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై... హర్ ఘర్ తిరంగా అంటూ నినదిస్తూ మువ్వెన్నల జెండా చేత బట్టి ముందుకు సాగారు. వీక్షకుల్లో జాతీయ భావాన్ని, స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.విజయభాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఊపి హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ క్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్ని కృష్ణ, డి.ఎఫ్.ఓ. లక్ష్మణరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, డి.ఎస్.డబ్ల్యూ.ఎస్. అధికారి మంజులవాణి, ఇతర జిల్లా అధికారులు ర్యాలీగా సాగారు. అనంతరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేసి విద్యార్థులు, అధికారులు, క్రీడాకారులతో కలిసి తిరిగి ఎన్టీఆర్ స్టేడి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అక్కడకు విచ్చేసిన వారిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో స్వాతంత్ర్య సమర యోధులు ఎంతో కృషి చేశారని, ఎన్నో త్యాగాలను చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాలను, సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. వారి బాటలో పయనించి యువత ఎదగాలని ఆకాంక్షించారు. దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు.

పాయకరావుపేట: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాయకరావుపేటలో కూటమి నాయకులు హర్ ఘర్ తిరంగ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్వాత ంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, రవిరాజు, చించలపు ప్రదీప్, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, ఆచంట దొర, పల్లా విలియం కేరి, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: సత్యసాయి ట్రస్టు సాయి వికాస్ ఆధ్వర్యంలో కాళ్ల మాతి నాయుడు పర్యవేక్షణలో పాయకరావుపేటలో ఉన్న కొత్త హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లింగాలతోట కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్ రావు, చిట్టిబాబు, కాళ్ల సాయి చందు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పరవాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సంఘం నాయకులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. నగరంలో పంచకర్ల నివాసంలో కలిసిన సంఘం నాయకులు తమ సమస్యలను పంచకర్లకు వివరించారు. వీఆర్ఏలకు వాచ్‌మెన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు సీనియార్టీ పద్ధతిలో అర్హత కలిగిన వీఆర్ఏలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీఆర్ఏల సంఘం కోశాధికారి ములకలపల్లి సంతోష్ కుమార్, సభ్యులు శేఖర్, సన్యాసిరావు, పైడిరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కతో అశోక చక్రం తయారు చేసిన రవి

విశాలాంధ్ర - నక్కపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సూక్ష్మ కళాకారుడు మండలంలోని చిన్నదొడ్డిగల్లుకు చెందిన దార్ల రవి అశోక చక్రాన్ని చెక్కపై తయారు చేశాడు. గంటన్నర పాటు ఈ అశోక చక్రం తయారు చేయడానికి పట్టిందని దార్ల రవి తెలిపారు.

దేశ విమోచన దినోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - గొలుగొండ: దేశ విమోచన దినోత్సవం సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు జాతీయ జెండాతో మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు చందక గౌరినాయుడు ఆధ్వర్యంలో ఏఎల్ పురం గ్రామం నుండి మండల కేంద్రమైన గొలుగొండ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ బిజెపి పార్టీ నాయకుడు, సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దరిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశ విమోచన దినోత్సవం జరుపుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రమణ యాదవ్, నెల్లూరు సాంబశివ, బాదం లోవరాజు, అల్లూరు జిల్లా నాయకులు అరిమెల రాజు, రీముల చంద్రరావు పాల్గొన్నారు.

ఎస్.ఎం.సి. ఎన్నికల్లో సీక్రెట్ ఓటింగ్ జరపాలి

విశాలాంధ్ర - చోడవరం: ఈ నెలలో జరగనున్న ఎస్.ఎం.సి (స్కూల్ కమిటీ) చైర్మన్ బోర్డ్ ఎలక్షన్‌లో చేతులెత్తే విధానాన్ని మార్చి సీక్రెట్ ఓటింగ్ జరిగే లాగా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్, విద్యా శాఖాధికారులకు పలు ప్రజా సంఘాలు, ఎన్.ఆర్.ఐ. సోషల్ కల్చరల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చితకల రమణ బాబు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్ జరిగేటప్పుడు అధికార పార్టీ ఎన్నుకోబడ్డ వ్యక్తి, అలాగే ప్రతిపక్ష పార్టీ ఎన్నుకోబడ్డ వ్యక్తి ఇరువురుని చేరోవైపు నిల్చోపెట్టి చేతులెత్తి ఎన్నుకునే విధానం వల్ల విద్యార్థి విద్యార్థిని తల్లిదండ్రులకు అధికార పార్టీ వల్ల గాని అధికారంలో ఉన్న సర్పంచ్‌వల్ల గాని ప్రభుత్వం నుంచి వచ్చే కొంత మంది ప్రజలకి అందవలసిన స్కీములు అందడం లేదన్నారు. స్కూల్లో చేతులెత్తే విధానాన్ని దృష్టిలో పెట్టుకొని కక్ష సాధింపు చర్యలు జరిగే అవకాశం ఉన్నందువలన దీనిని మార్చమని వినయపూర్వకంగా కోరుతున్నామన్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరునికి చవితి రాట

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని స్వయంభూ దేవాలయాలన్నింటిలో చరిత్ర ప్రసిద్ధి చెందిన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో రానున్న వినాయక చవితి గణపతి నవరాత్రి ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు చేతుల మీదుగా బుధవారం ఉత్సవరాట వేయించారు. ఈ ఏడాది గణపతి నవరాత్రులు దిగ్విజయంగా జరిపించాలని స్వామిని కోరారు. గణేష్ దీక్షలు, నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దాతలు, సేవకులు, కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి.సత్య నారాయణ మూర్తి, అర్చకులు కొడమంచిలి చలపతిరావు, కొడమంచిలి శ్రీనివాస్, సంగీస విగ్నేష్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్కి 50 రోజుల వేడుకలు

విశాలాంధ్ర - కసింకోట: తెలుగు సినిమా స్థాయిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి చిత్రం విజయవంతంగా అనకాపల్లి సత్య నారాయణ థియేటర్‌లో 50రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అభిమానులు విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా 50 రోజుల విజయోత్సవ కేక్ కట్ చేసి అభిమానులకి పంపిణీ చేశారు. అలాగే 50రోజుల షీల్డ్‌ని థియేటర్ యాజమాన్యం బుద్ధ శ్రీనుకి, అలాగే వెంకటేశ్వర థియేటర్ యజమాని మళ్ల వెంకట్రావుకి ప్రభాస్ ఫాన్స్ అధ్యక్షులు జీవీయల్‌యన్ రాజు, గౌరవ అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జోగేంద్ర, కోశాధికారి కొణతాల అరవింద అందజేశారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు శ్రీనివాస వర్మని అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాండ్రేగుల జోగేంద్ర మాట్లాడుతూ కల్కి చిత్రం అనకాపల్లి పట్టణంలో 50 రోజులు ప్రదర్శించబడడం, 49రోజుల్లో కోటి పదిలక్షలు వసూళ్లు రాబట్టడంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు. అక్టోబర్‌లో జరిగే ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు ఈసారి అనకాపల్లిలో చాలా వైభవంగా జరపబోతున్నామని అన్నారు. ఈ కార్ర్యకమంలో ఆంధ్ర ప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు, ఆళ్ల ప్రసాద్, కిషోర్, భీమర శెట్టి నాని, ధర్మేష్, మనోజ్, అనేకమంది ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

కుసులువాడలో మైనింగ్ జీవోలు రద్దు చేయాలి

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలస సిఐటియు ఆఫీసులో ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో మైనింగ్ తవ్వకాలకు ప్రజా అభిప్రాయ సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ ఈ మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతిస్తే పంచాయతీ పరిధిలో ఆరు గ్రామాల ప్రజలకు తీవ్రం నష్టం జరుగుతుందని దీనివల్ల పర్యావరణ కాలుష్యం జరిగి ప్రజలు అనేక అనారోగ్యాల పాలు అవుతారన్నారు. తక్షణమే మైనింగ్ ఆర్డర్స్ జీవోలు నిలుపుదల చేయాలని కోరుతూ ఆగస్టు 16, 17 తేదీల్లో సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో కుసులవాడ పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలలో పాదయాత్రకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో భీమిలి సిపిఎం పార్టీ జోన్ కమిటీ నాయకుల రవ్వ నర్సింగరావు, ఎస్ అప్పలనాయుడు, ముద్దాడ రాము, పంపాను సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముకుందపురంలో పొలంబడి

విశాలాంధ్ర - వి.మాడుగుల: వరినాట్లు వేసే ముందు వేరు శుద్ధి తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. బుధవారం మండలంలోని ముకుందపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరినాట్లను పరిశీలించారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ నాట్లు వేసేందుకు వరినారును సూడోమోనాస్ శిలీంద్రనాశినితో వేరు శుద్ధి చేసి నాట్లు వేసినట్లు అయితే అనేక రకాల తెగుళ్ల నుండి ముఖ్యంగా పొడ తెగులు ఆశించకుండా నాట్లు వేసిన 30 రోజుల వరకు పంటను కాపాడుకోవచ్చునన్నారు.

వేరునారుమడి దశలో ఉన్నప్పుడే కాంతం తొలుచు పురుగు ఆకుల చివరి భాగంలో గుడ్లను పెడుతుందని, కావున నాట్లు వేసే ముందుకు వేరు శుద్ధి చేసినచో తర్వాత తప్పనిసరిగా ఆకుల చిగురులను త్రుంచి నాట్లు వేయడం వలన నాటిన 30 రోజుల వరకు కాంతం తొలుచు పురుగు ఆశించదన్నారు. వరుసలలో నాట్లు వేయడం వల్ల దుబ్బు బాగా కట్టి పంట ఎదుగుదలకు సమాంతరంగా ఉండి కలుపు సమస్య తగ్గుతుందన్నారు. నాట్లు వేసినప్పుడు తూర్పు పడమర దిశగా కాలిబాటలు తీయుట వలన దుబ్బులకు గాలి వెళుతురు దారాలంగా తగిలి చీడపీడలు ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎ.మంగరాజు, ఎస్.శ్రావణి, పి.జగ్గారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చుట్టుగెడ్డ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలంలో శంకరం పంచాయతీ చివారు చుట్టుగెడ్డ గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కృష్ణం పాలెం తారు రోడ్డు నుండి గ్రావెల్ రోడ్డు మీదుగా చుట్టుగెడ్డ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గిరిజనులతో కలిసి తారు రోడ్డు నిర్మాణం చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కురుస్తున్న వర్షాలకు కృష్ణంపాలెం తారు రోడ్డు నుండి చుట్టుగెడ్డ వరకు గ్రావెల్ రోడ్డు ఇదివరకు వేయడం జరిగిందని, చుట్టుగెడ్డ నుండి కూర్మనాథపురం తారురోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనపరెడ్డి కొండలరావు, నెల్లూరు కృష్ణ, అల్లంగి చిన్నారావు, కిల్లి బాలరాజమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై జాతీయ పతాకం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరా వుపేటకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ కుందూరు సంజయ్ దీపక్ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెన్సిల్ ముల్లుపై సెంటీమీటర్ సైజులో జాతీయ జెండాను తయారు చేశాడు. మైక్రో ఆర్టిస్ట్ కుందూరు సంజయ్ దీపక్ వైజాగ్ బిట్స్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

జనసేనలో చేరిన వైసీపీ ఎంపీటీసీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో దోసూరు ఎంపీటీసీ రాజాన పద్మజ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో బుధవారం ఎంపీటీసీ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే, ఎంపీటీసీకి పార్టీ కండువా కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని, అదే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాబ్జి, లాలం చందు పవన్ సాయి, అప్పారావు, చిన్ని పంతులు తదితరులు ఉన్నారు.

రెవెన్యూ మంత్రి సత్య ప్రసాద్‌ను కలిసిన చందక శివ

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగానీ సత్యప్రసాద్‌ను బుధవారం విశాఖ నోవాటెల్ హెూటల్‌లో ఆనందపురం మండలం ప్రముఖ సంఘ సేవకులు చందక శివ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో కొన్ని రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసు కెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయనతోపాటు బీసీ సంక్షేమ కేంద్ర కార్యదర్శి, స్టేట్ అధ్యక్షులు పేబ్బిలి రవికుమార్, లండ రమణ ఉన్నారు.

ఆరిలోవ టేక్ ప్లాంటేషన్ సందర్శన

విశాలాంధ్ర - గొలుగొండ: నర్సీపట్నం రేంజ్ పరిధిలో గల ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఉన్న టేక్ ప్లాంటేషన్‌ను విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ రేంజ్ అధికారిణి దీప్తి బుధవారం సందర్శించారు. 2006లో నాటిన టేక్ ప్లాంటేషన్ ఎదుగుదలపై పరిశీలనకు వచ్చినట్లు ఆమె తెలిపారు. అప్పట్లో ఐదు రకాలైన టేకు స్టాంపులను ఈ ప్లాంటేషన్‌లో నాటడం జరిగిందని అన్నారు. నాటిన ఐదు రకాలలో ఎంత మేర పెరిగిందో పరిశీలించి వాటిలో ఎదుగుదల కలిగిన టేక్ దుంగలను కొత్త ప్లాంటేషన్‌లో వేసే విధంగా నాటే విధంగా రీసెర్చ్ చేస్తున్నామని అన్నారు. అలాగే మరో ప్లాంటేషన్ వేదుమికొండ ప్రాంతంలో పరిశీలిస్తామని రేంజ్ అధికారిణి దీప్తి అన్నారు. ఈమె వెంట రీసెర్చ్ సెంటర్ డీఆర్ఓ పార్వతీశం, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పంద్రాగస్టు నమూనా

విశాలాంధ్ర - నక్కపల్లి: 78వ స్వాతంత్ర దినోత్సవానికి స్వాగతం పలుకుతూ నక్కపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆగస్టు 15, 78వ స్వాతంత్ర దినోత్సవం నమూనా రూపంలో తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కర్నీ ఈ నమూనా విశేషంగా ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ సువర్ణ ఆధ్వర్యంలో ఈ నమూనా ఏర్పాటు చేశారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఉమ్మిడి జగన్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మాజీ వైస్ ఎంపీపీ కుమారుడు, వైసీపీ యువ నాయకులు ఉమ్మిడి జగన్ వైసీపీ అధినేత జగన్‌ను బుధవారం కలిశారు. మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ నాయకత్వంలో వైఎస్ఆర్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నట్లు జగన్‌కు తెలిపారు.

పెందుర్తి గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శాఖ గ్రంథాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి బి.సూర్యకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా పరిషత్ హై స్కూల్, గవర్నమెంట్ హై స్కూల్ నుండి 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా జడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు సిహెచ్ జగదీష్, ఎం.జగన్నాథరావులు వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న గ్రంథాలయ ఆవరణలో పతాకావిష్కరణ సందర్భంగా గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ సూర్య కళ తెలిపారు.

మంత్రి అనగానికి ఘనస్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నగర అధికారిక కార్యక్రమాలు కోసం బుధవారం విశాఖపట్నం ఎయిర్పోర్ట్‌కు విచ్చేశారు. మంత్రికి విశాఖ బీసీ సమైక్య సంక్షేమ సంఘం అధ్యక్షులు పెబ్బిలి రవికుమార్, రాష్ట్ర బీసీ నాయకులు ఎమ్మెల్సీ దువ్వరపు రామారావుల ఆధ్వర్యంలో బీసీ కుల సంఘ నాయకులు, వివిధ బిసి కమిటీల సభ్యులు, మహిళా కమిటీ నాయకులు భారీ స్థాయిలో మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఒక ప్రయివేటు హెూటల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు బిసి కులాల సమస్యలపై పెబ్బిలి రవి కుమార్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి పాల్గొన్నారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
అనకాపల్లి జిల్లాలో ఈ కింది కేంద్రాల్లో పని చేయుటకు కనీస విద్యార్హత ఇంటర్, ఆపైన చదివి జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి తెలుగు భాషలో స్పష్టంగా రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
తేది: 18-8-2024వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అనకాపల్లి విశాలాంధ్ర కార్యాలయంలో అర్హత రాత పరీక్ష నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు 18వ తేదీ ఉదయం 9.30 గంటల్లోగా వాట్సాప్‌లో గాని నేరుగా గాని తమ పేర్లు నమోదు చేసుకోగలరు. అదేరోజు మధ్యాహ్నం 2 గం.ల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడును.
ఖాళీలు: అనకాపల్లి టౌన్, అనకాపల్లి కలెక్టరేట్, చోడవరం రూరల్, రోలుగుంట, బుచ్చయ్యపేట, నర్సీపట్నం రూరల్, నాతవరం, సబ్బవరం కేంద్రాల్లో పని చేయాలి.
సంప్రదించాల్సిన చిరునామా:
కొండలరావు, విశాలాంధ్ర బ్యూరో చీఫ్
విశాలాంధ్ర కార్యాలయం, దుర్గా లాడ్జి వీధి, నర్సింగరావుపేట, రామచంద్ర థియేటర్ వెనుక, అనకాపల్లి.
సెల్: 9291900805, 9573385159.

ట్రాన్స్ఫార్మర్ రిపేర్ చేసి ప్రాణ నష్టం జరగకుండా చూడండి

విశాలాంధ్ర-పద్మనాభం: విశాఖపట్నం జిల్లా, పద్మనాభం మండలం క్రిష్టాపురం గ్రామంలో చిన్నట్యాంకుకు సమీపంలో వున్న కరెంట్ స్థంబానికి మినీ ట్రాన్స్ఫర్మర్ ఉంది. దానికి సంబంధించిన మెయిన్ స్విచ్ సేఫ్టీ బాక్స్ లేకపోవడం వల్ల, ఈ స్థంబానికి వున్న ఎర్త్ ద్వారా వర్షం పడిన సందర్భంలో దాని ద్వారా కరెంటు ఫ్లే వస్తుంది. ఈ స్తంభానికి ఆనుకుని పరిసర ప్రాంతంలో సుమారు 13 కుటుంబాలు నివశిస్తున్నాయి. అందులో ఎక్కువగా చిన్నపిల్లలు ఉండడం వల్ల ఏ సమయంలో ఏం జరుగుతుందో అన్న భయాందోళనలో ఉంటున్నాము. ప్రాణ, ఆస్తి నష్టం జరగకముందే దీనిని పరిశీలించి. సమస్య పరిష్కారం అయ్యేవిధంగా సేఫ్టీబాక్స్, ఎర్తవైర్ ద్వారా కరెంటు సప్లే కాకుండా తగిన చర్యలు వీలైనంత తొందరగా తీసుకుంటారని వినయపూర్వకముగా ప్రార్ధిస్తూయున్నాము.

పారిశుద్ధ నిర్వహణపై జివిఎంసి కమిషనర్ అసంతృప్తి

శానిటరీ కార్యదర్శులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నగరంలోని పారిశుధ్య సరిగా చేపట్టడంలేదని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ ప్రజారోగ్య విభాగం పని తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. బుధవారం వి.ఎం.ఆర్.డి.ఎ. చిల్డ్రన్ ఎరీనా థియేటర్ లో జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోన్ల కమిషనర్లు, ఎ.ఎం.ఒ.హెచ్.లు, వార్డు సచివాలయం శానిటరీ కార్యదర్శులతో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కెపాసిటీ బిల్డింగ్, స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ ముందుగా స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమాల పారామీటర్లను, నియమ నిబంధనలను వీడియో ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ 2.0లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ 2024కు సంసిద్ధం కావాలని విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మూడు వారాలుగా నగరంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించడం జరిగిందని, నగరంలో పారిశుధ్య పనులు సరిగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ కార్యదర్శులు పనితీరును మార్చుకొని ప్రణాళిక ప్రకారం విధులు నిర్వహించాలని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణకు విశాఖ నగరంలో ఉన్న యంత్రాంగం రాష్ట్రంలో ఎక్కడా లేదని, పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో జివిఎంసి విఫలమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుండి చెత్త విభజన, సేకరణ, తరలింపు కొరకు ఒక ప్రత్యేక ప్రణాళికను శానిటరీ కార్యదర్శులు, అధికారులు రూపొందించుకోవడం వలన నివాసిత ప్రాంతాలలో డస్ట్ బిన్ ఫ్రీ చేయవచ్చున్నారు. మురికివాడలలో రద్దీగా ఉన్న కమర్షియల్ ప్రాంతాలలో, ప్రధాన కాలువలలోని వ్యర్థాలు లేకుండా నిత్యం పరిశుభ్రతపై పరిశీలన జరపాలన్నారు. ప్రధాన కాలువల కల్వర్టుల వద్ద జివిఎంసి చిహ్నంతో కూడిన స్క్రీనులను ఏర్పాటు చేయాలని, ఆ స్క్రీనులను చోదకులు దొంగిలించి అమ్మకుండా, స్క్రాప్ దుకాణదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్లను కమీషనర్ ఆదేశించారు. విశాఖ నగర పరిశుభ్రత వలన జివిఎంసికి మంచి ర్యాంకు సాధించగలమని తద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులు, అమృత్ నిధులు నగరానికి రావడం వలన విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రోడ్లను స్వీపింగ్ చేసి చెత్త పోగులుగా రోడ్లపై ఉంచకుండా వెంటనే వ్యర్థాల తరలింపునకు వాహనం ఏర్పాటు చేసి తద్వారా చెత్తను తరలించాలని అధికారులను ఆదేశించారు. నిత్యం బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు పడే ప్రదేశాలు (గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్) గార్బేజ్ డంప్ పాయింట్స్ ను గుర్తించి ఆయా ప్రదేశాల్లో సి సి కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన నిర్మూలనపై దృష్టి సారించాలన్నారు. నివాసిత ప్రాంతాలలో, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు పడవేయకుండా నివాసితులు ఇంటివద్దే వ్యర్థాలను వేరు చేసి అందించుటకు ప్రజలకు వారానికి ఒకసారి బృందంగా వెళ్లి అవగాహన కల్పించాలని, 15 రోజుల లోగా నివాసిత ప్రాంతాలలో డస్ట్ బిన్ ఫ్రీ ఏర్పాటుకు ప్రణాళికలను చేపట్టాలని శానిటరీ కార్యదర్శులకు, ప్రజారోగ్య అధికారులకు కమీషనర్ ఆదేశించారు, వార్డు శానిటరీ కార్యదర్శి నుంచి అదనపు కమీషనర్ వరకు నిత్యం వార్డులలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ పై పర్యవేక్షణ జరిపేలా చర్యలు చేపట్టాలని, స్వచ్ఛ సర్వేక్షన్ 2024 విశాఖ నగరానికి ప్రథమ స్థానం సాధనే లక్ష్యంగా ప్రజారోగ్య యంత్రాంగం కృషి చేయాలని అదనపు కమీషనర్ డి.వి.రమణమూర్తిని కమీషనర్ ఆదేశించారు. అనంతరం అదనపు కమీషనర్ డి.వి.రమణ మూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ కమీషనర్ వారి ఆదేశాలను, సూచనలను పాటిస్తూ నగరం లో పారిశుధ్య నిర్వహణ మెరుగుకు కృషి చేస్తామని కమీషనర్ కు తెలిపారు. ఈ సమావేశంలో అందరు జోనల్ కమీషనర్లు, ఎ.ఎం.ఒ.హెచ్.లు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్ లు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపి విద్యార్థులచే హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర-పెదగంట్యాడ: 78వ స్వాతంత్ర దినోత్సవ సంబరాలను పురస్కరించుకొని గురువారం మన దేశ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపు మేరకు భారతీయులందరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ నడుపూరు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ శ్రీనివాసరావు , ఎంఈఓ -01 శ్రీనివాస రావు, ఎంఈఓ -02 రమనాజి, మరియు స్థానిక 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ముఖ్య అతిథిగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ మువ్వన్నెల జెండా చేతబూని తమ పాఠశాల నుండి నెల్లిముక్కు ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భములో 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి గారు మాట్లాడుతూ రేపటి దేశ భవిష్యత్తు అయిన పిల్లలు అందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లి వాళ్ల తల్లితండ్రులకు, ఉపాధ్యా యులకు, దేశానికి గర్వకారణంగా నిలబడాలి అని దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి,ఉపాధ్యాయులు జబర్దస్త్ ఫేం సత్తిపండు(సత్యన్నారాయణ) మాస్టర్ , ఎంఈఓ -01 శ్రీనివాస రావు, ఎంఈఓ -02 రమనాజి స్థానిక నాయకులు గొందేసి మహేశ్వర రెడ్డి కణితి అప్పల రాజు, దొమ్మేటి సోము నాయుడు ఇతర పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వతంత్ర ఫలాలను ప్రజలకు అందకుండా చేస్తున్న ప్రభుత్వాలు:

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: స్వతంత్ర దినోత్సవ సందర్భంగా సిఐటియు అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహ రావు మాట్లాడుతూ. స్వతంత్ర ఉద్యమం కోసం అనేకమంది ప్రాణాలు అర్పించారనీ నేడు ప్రభుత్వాలు స్వతంత్ర ఫలాలను ప్రజలకు అందకుండా చేస్తున్నాయని అన్నారు. కులం మతం పేరుతో ప్రజల మధ్య తేలికలు తీసుకొస్తున్నారని నాడు కులమతాలకు అతీతంగా ప్రజలందరూ బ్రిటిష్ వాడిని దేశం నుంచి వెళ్లగొట్టారని అదే స్ఫూర్తితో మన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు ఈ సందర్భంగా అంగన్వాడి ఆశ మున్సిపల్ కార్మికులు వారి పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి గీతాలతో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె .లోకనాథం సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. శంకరరావు, జె . కోటేశ్వరరావు కార్యదర్శులు గోనేరు వరలక్ష్మి ఉపాధ్యక్షులు గణిసెట్టి సత్యనారాయణ ,రంగల రాము, జయము నాయుడు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డిడి వరలక్ష్మి రైతు సంఘం నాయకులు జి. నాయుడు బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్. రమణ, వెంకటేష్, బి శట్టి అప్పారావు, నిమ్మకాయల అజయ్ తదితరుల పాల్గొన్నారు.

జనసేన నాయకుడు ప్రభుత్వ పాఠశాలకు మంచినీటి పైప్ లైన్ సొంత నిధులతో ఏర్పాటు,

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామం లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు జనసేన విశాఖ జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ వి బి నాయుడు తన సొంత నిధులతో ప్రభుత్వ ట్యాంకు నుండి స్కూల్ ప్రహరీ వరకు వాటర్ పైపులైను వేసి కుళాయి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మరియు ప్రధానోపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసారు.

బౌద్ధం విశ్వ వ్యాపితం

ఏయు తెలుగు శాఖదిపతి ఆచార్య జర్రా అప్పారావు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : బౌద్ధం విశ్వ వ్యాపతం అయిందని ఏయు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఆచార్య ఎలవర్తి విశ్వనాథ రెడ్డి సంపాదకత్వం వహించిన " తెలుగు భాష సాహిత్యం సంస్కృతుల పై బౌద్ధ మత ప్రభావం" అనే పుస్తకావిష్కరణ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం, భాష, సంస్కృతులపై బౌద్ధం ప్రభావం ఎంతో ఉందన్నారు. ఆచార్య విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ తన సంపాదకత్వం వహించిన పుస్తకం మధురం కావడం నేడు తన పని చేసిన శాఖలోనే ఆవిష్కరణ జరగడం చాలా సంతోషాన్ని కలిగించిందని చెప్పారు. పుస్తకావిష్కరణ గావించిన ఆచార్య ఎం. జయదేవ్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న అనేక మూఢ నమ్మకాన్ని నాటి కాలంలో బౌద్ధమతం పారద్రోలిందని తెలియజేశారు. డాక్టర్ ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేస్తూ వ్యక్తి పరిపూర్ణంగా మారడానికి బౌద్ధమతం దోహదం చేస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ సూర్యరావు మాట్లాడుతూ బౌద్ధమతం ఆసియా కి మాత్రమే కాదు ప్రపంచానికి వెలుగునిచ్చిందని బౌద్ధమత ప్రభావంతో తెలుగులో వెలువడిన ప్రాచీన కావ్యాలు ఆధునిక కావ్యాలు వచ్చిన కావ్యాలు మొదలుకొని మిగతా అంశాలు అన్నిటిని కూడా విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్ కుమార్ , మరియు పరిశోధకులు,స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈక్యూ-6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణకై పిపిపి విధానంలో ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు ఈస్ట్ క్యూ 6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణ కోసం ఎవర్ సన్ మెరైన్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. పిపిపి విధానంలో ఈ బెర్త్ ను ఆధునీకరించనున్నారు. ఒప్పందంలో బాగంగా ఈక్యూ 6 బెర్త్ ను 255 మీటర్ల పొడవు 12.10 మీటర్ల డ్రెడ్జ్ లోతు మేరకు పెంచనున్నారు. దీని వల్ల 200 మీటర్ల పొడవు ఉన్న నౌకలను బెర్తింగ్ చేసేందుకు అవకాసం కలుగుతుంది. ఈ ప్రాజెక్ట్ లో భాగంగా ఈక్యూ 6 బెర్త్ పై 1500 (టన్స్ పర్ అవర్) సామర్థ్యం కలిగిన 120 టన్నుల ఎత్తు సామర్థ్యం గల 01 హార్బర్ మొబైల్ క్రేన్ , 01 మొబైల్ హాపర్స్ , ఇతర హ్యాండ్లింగ్ పరికరాలు క్రేన్లు, లోడర్లు, ట్రక్కులు, ఫోర్క్ లిఫ్ట్ మొదలైనవి ఏర్పాటు చేస్తారు. మొత్తం రూ.66.12 కోట్లు పెట్టుబడితో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుంది. పాక్షిక యాంత్రీకరణ వల్ల అన్ని రకాల డ్రై బల్క్ కార్గోలను 2.62 హ్యాండ్లింగ్ సామర్థ్యంతో నిర్వహించేందుకు వీలవుతుంది. బెర్త్ కు సమీపంలో ఉన్న 3.03 ఎకరాల స్థలంలో తాత్కాలికంగా కార్గో నిల్వ చేయడానికి వీలవుతుంది. బెర్త్ ముందర నుండి 200 మీటర్లలో 10 ఎకరాల స్టాక్ యార్డ్ కలిగి ఉంటుంది . బెర్త్ అభివృద్ధి ద్వారా 40,000 నుండి 50,000 సామర్థ్యం మధ్య ఉన్న నౌకలను నిర్వహించే వీలు కలుగుతుంది. 200 మీటర్ల పొడవు 16.4 మీటర్ల వెడల్పు ఉన్న నౌకలను నిర్వహించలుగుతారు. బెర్త్ యొక్క డ్రెడ్జ్ లోతు 16 మీటర్లు ఉంటుంది. ఒప్పందలో భాగంగా ప్రాజెక్ట్ పనులు 15 నెలల్లో పూర్తి చేసి బెర్త్ ను వినియోగంలోకి తీసుకువస్తారు. పిపిపి ప్రాజెక్టు సమయం 30 సంవత్సరాలుగా ఉంటుంది. బెర్త్ ఆధునీకీకరణ వలన 50 మందికి ప్రత్యక్ష , పరోక్ష ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ప్రాజెక్టును భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పర్యావరణ రక్షణ చర్యలు పాటిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. ఈ వివరాలను పోర్ట్ కార్యదర్శి టి వేణుగోపాల్ మీడియాకు తెలియజేశారు.

తరగతులు అక్కడ... అనుమతులు ఇక్కడా...

అనందపురంలో అనుమతులు మారికవలసలో తరగతులు
- ప్రేమ ఎడ్యుకేషనల్ పేరు మీద దోపిడి - అధ్యాపకులకు కుచ్చు టోపీ
5 నెలలుగా జీతభత్యాలు చెల్లించకుండా కాలయాపన....
అధ్యాపకులను మార్పు చేయడానికి ప్రయత్నాలు.....
పూర్తికాని బిల్డింగుల్లోనే ఫ్యాకల్టీ వెరిఫికేషన్లు
విద్యార్థుల చదువుల పేరుతో భారీ దోపిడీకి ప్రయత్నాలు చేస్తూ విద్యాలయ అనుమతులు

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం ఐటీ సైజులో ప్రీ పోలియో సర్జికల్ రీసెర్ఛ్ ఫౌండేషన్ వారు ప్రేమ ఎడ్యుకేషన్ ఆఫ్ కాలేజ్ పేరట అనుమతులు తీసుకొని మారికవలసలో తరగతులు నిర్వహిస్తూ మధ్యవర్తులు లక్షలాది రూపాయలు విద్యార్థుల నుండి వసూలు చేస్తున్నారు. విశాఖపట్నంలో స్టడీ సెంటర్లు నిర్వహించుకునే మహేష్ అనే వ్యక్తి కళాశాల వనులను తానే చూసుకుంటానంటూ ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జీవనజ్యోతి ,శైలజ బృందం బుధవారం గంభీరం కన్స్ట్రక్షన్ లో ఉన్న బిల్డింగ్ వద్దకు తీసుకువచ్చి ఫ్యాకల్టీ వెరిఫికేషన్ చేశారు అసలు బిల్డింగే పూర్తికాని బిల్డింగులో వెరిఫికేషన్ చేయడం ఏమిటంటే తోటి ఓల్డ్ ఫ్యాకల్టీస్ ఆశ్చర్య వ్యక్తం చేశారు.

2007 సంవత్సరంలో ప్రేమ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరున తిమ్మాపురంలో బీఈడీ కళాశాల ఏర్పాటు చేసి కొన్ని సంవత్సరాల తర్వాత బిల్డింగ్ పూర్తిగా శిథిలం అవడంతో అక్కడినుండి తాత్కాలికంగా మారికవలస పరిసర ప్రాంతాలలో కళాశాల నిర్వహించారు ఇటీవల 2021 న ఆనందపురం మండలం గంభీరం ఐటీ సేజ్ లో ఫౌండేషన్ తరపున భూములను తీసుకొని బిఈడి కళాశాల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు బిల్డింగ్ కన్స్ట్రక్షన్ అవుతుండగానే ఇక్కడ 2021లో బీఈడీ కళాశాల ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు.

అయితే వాస్తవానికి మారిక వలసలో ప్రైవేట్ భవనాలలో తరగతులు చెబుతూ బయట రాష్ట్రాల నుండి విద్యార్థులు తీసుకుని వచ్చి అధిక ఫీజులు వసూలు చేసి మధ్యవర్తులు సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలియవస్తున్నది ఈ క్రమంలో ఈ ఏడాది కళాశాలను పరిశీలించడానికి ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నిర్మల జ్యోతి ,సౌజన్య సిబ్బంది కళాశాలకు చేరుకొని అసంపూర్ణంగా ఉన్న బిల్డింగులో ఫ్యాకల్టీ వెరిఫికేషన్ నిర్వహించారు

ఈ సందర్భంగా నిర్మల జ్యోతి మాట్లాడుతూ కళాశాల అనుమతి ఒకచోట తరగతి గదులు వేరేచోట నిర్వహించడంపై తమకు సందిగ్ధంగా ఉందన్నారు. కళాశాలలో పనిచేసిన 16 మంది ఫ్యాకల్టీ ను తీసివేయడానికి గల కారణాలను యజమాన్యం దృష్టికి తీసుకెళు తున్నట్లు తెలిపారు.